వేడుకగా ఆర్జిత కల్యాణోత్సవం




కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు, ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి


నగరి: టీటీడీ ఆధీనంలోని బుగ్గ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి ఆర్జిత కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. చైత్రశుద్ధ చతుర్ధశి తిథి, ఉత్తర ఫల్గుణి నక్షత్రంలో నిర్వహించిన ఈ వేడుకకు స్థానిక భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ, కాశీవిశ్వేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. తిరుమల దేవస్థానం నుంచి వచ్చిన వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం అమ్మవారి పసుపు, అక్షింతలు భక్తులకు ప్రసాదంగా అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ నాగరత్న, సూపరింటెండెంట్ రమేష్, ఇన్‌స్పెక్టర్లు గుణశేఖర్, వెంకటరమణ, ఎంపీపీ భార్గవి, అర్చకులు కుప్పయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




వైభవంగా రథోత్సవం

నగరి: స్వర్ణకాంతులు చిందే రథంపై కామాక్షీ సమేత కరకంఠేశ్వరుడు దేదీప్యమానంగా మాడవీధుల్లో విహరించారు. పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో పంగుణోత్తర కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7వ రోజు మంగళవారం రథోత్సవం నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి ఆర్కేరోజా ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ మార్యాదలతో ఆమెను ఆహ్వానించారు. హరహర నామస్మరణల మధ్య ఆమె రథాన్ని ముందుకు లాగి వేడుకలను ప్రారంభించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఆమెతో పాటు రథాన్ని లాగారు. కరకంఠేశ్వరునికి కర్పూరహారతులిచ్చి దర్శించుకున్నారు. రథంపై విహరిస్తున్న స్వామివారికి ప్రతి ఇంటి వద్ద కొబ్బరికాయలు కొట్టి హారతులు పట్టారు. కిక్కిరిసిన జనం నడుమ మూడు గంటల పాటు ఊరేగింపు సాగింది. కేరళ వాయిద్య మేళాలు అలరించాయి. ఊరేగింపు అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, పార్టీ నాయకులు గోపాల్‌రెడ్డి, దయానిధి, బీడీ భాస్కర్, ఇంద్రయ్య, శ్రీనివాసులు, తేన్‌మొళి, వేణి, సలీం, ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం, రథం విరాళ దాతలు కోనేరు అమృతమ్మ, సుబ్రమణ్య మొదలియార్, పెరుమాల్, సీఎస్ మణి, ఎస్ఆర్ మూర్తి, మొదలియార్ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.







క్లుప్తంగా

స్నాతకోత్సవానికి గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి ఆహ్వానిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర వేద విశ్వ విద్యాలయం త్వరలో ఏడవ స్నాతకోత్సవం జరుపుకోనుంది. ఈ నేపథ్యంలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణీ సదాశివమూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ ఏవీ.రాధేశ్యామ్ సోమవారం రాత్రి గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. స్నాతకోత్సవంలో చాన్సలర్ హోదాలో పాల్గొనాలని ఆహ్వానించారు. అనంతరం వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను గవర్నర్‌కు వివరించారు.

'ఆర్టీఐ' రాష్ట్ర జాయింట్ కోఆర్డినేటర్‌గా హనుమంత నాయక్



తిరుపతి కల్చరల్: ఆర్టీఐ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ కోఆర్డినేటర్‌గా తిరుపతి నెహ్రూనగర్‌కు చెందిన హనుమంత నాయక్‌ను నియమించినట్లు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.ముత్తు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఈయన తిరుపతి జిల్లా కన్వీనర్‌గా చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర జాయింట్ కో ఆర్డినేటర్‌గా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. తనకు రాష్ట్ర స్థాయి పదవి కల్పించిన అసోసియేషన్ నేతలకు హనుమంతనాయక్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సమాచార హక్కు చట్టం కార్యకర్తలను ఒక వేదికపైకి తీసుకొచ్చి ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

స్విమ్స్‌కు కుర్చీల వితరణ



కుర్చీలు అందజేస్తున్న దాతలు

తిరుపతి తుడా : స్విమ్స్‌కు వైద్యంకోసం వచ్చే రోగుల సౌకర్యార్థం రూ.2 లక్షల విలువచేసే కుర్చీలను విరాళంగా అందజేశారు. తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం పెద్దకన్నలికి చెందిన కోమటి వాసుదేవరెడ్డి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు వాటిని మంగళవారం స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మకు అందజేశారు. దాతలు ఎల్.మాగిరెడ్డి, ఎల్.మాధవి, జి.మనోరమ, బి.శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం



ఎక్కువ మంది విద్యార్థులను ఎక్కించుకుని వెళుతున్న ఆటో

చంద్రగిరి: వేలకు వేలు ఫీజులు గుంజుతున్న ప్రైవేటు పాఠశాల నిర్వాహకులు విద్యార్థుల భద్రతను గాలికి వదిలేస్తున్నారు. చంద్రగిరిలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థులు మంగళవారం ఇంటికి బయలుదేరారు. పాఠశాలకు చెందిన షేర్ ఆటోలో నిబంధనలకు విరుద్ధంగా సుమారు 25 మందికి పైగా పిల్లలను కూర్చోబెట్టారు. వారి బ్యాగులను ఆటో పైభాగంలో ఉంచారు. దీన్ని చూసిన పలువురు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే ఏమిటి పరిస్థితి అని ప్రశ్నిస్తున్నారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడే ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



రైతులకు మ్యాగజైన్లు అందజేస్తున్న అధికారులు

పాకాల : మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఇండియన్ బ్యాంక్ ఎల్‌ఎండీ సుభాష్ తెలిపారు. ఆయన మంగళవారం పంటపల్లి ఆర్‌బీకేలో మహిళా రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుటుంబంలో ప్రతి మహిళా ఆర్థిక పురోగతి సాధించాలని సూచించారు. డ్వాక్రా సంఘంలో చురుకై న పాత్ర పోషించాలని, తీసుకున్న రుణాలతో మంచి యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి అమీర్ మాట్లాడుతూ ఆర్‌బీకేలో ఈ నెలలో ప్రసారమయ్యే వివిధ వ్యవసాయ అనుబంధ రంగాల కార్యక్రమాలను తెలిపారు. అలాగే రైతులకు వ్యవసాయ పద్ధతులను తెలిపే మ్యాగ్‌జైన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెసిలిటేటర్లు ఆర్.భాస్కర్‌రెడ్డి, ఎం.ధనకోటి, వలంటీర్, ఆర్‌బీకే మిత్ర షాకీరా పాల్గొన్నారు.

అభివృద్ధికి దిక్సూచి



ప్రారంభానికి సిద్ధమైన చింతలచేను మాస్టర్ ప్లాన్ రోడ్డు



రోడ్డు ప్రారంభం కోసం స్థూపం ఏర్పాటు చేస్తున్న కూలీలు

- నేడు చింతలచేను మాస్టర్ ప్లాన్ రోడ్డు ప్రారంభం
- నగరంలో తగ్గిన ట్రాఫిక్ సమస్య
- బస్టాండ్ తూర్పు ప్రాంతంలో పలు నిర్మాణాలు ప్రారంభం

తిరుపతి తుడా : తిరుపతి నగర విస్తరణ, నగరానికి కనెక్టివిటీ పెంచడం, ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించడమే లక్ష్యంగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ 14 మాస్టర్ ప్లాన్ రోడ్లను శరవేగంగా నిర్మిస్తోంది. ఈ క్రమంలో ఆర్టీసీ బస్టాండు - ఎంఎస్ సుబ్బలక్ష్మి కూడలి నుంచి తూర్పు వైపు చింతల చేను మీదుగా హీరో హోండా షోరూమ్ రైల్వేగేట్ వరకు మాస్టర్‌ప్లాన్ రోడ్డును ఆరునెలల్లోనే పూర్తి చేశారు. రూ.6.3 కోట్లతో 80 అడుగుల వెడల్పుతో 1.5 కి.మీ పొడవున అత్యంత సుందరంగా ఈ మాస్టర్ ప్లాన్ రోడ్డు రూపుదిద్దుకుంది. దీన్ని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం ప్రారంభించనున్నారు. ఒకప్పుడు నడవడానికి కూడా వీలులేని దయనీయ స్థితిలో వున్న చింతల చేను పరిసర ప్రాంతాలు మాస్టర్ ప్లాన్ రోడ్డుతో ఊపిరి పీల్చుకుంటున్నాయి. రోడ్ల అభివృద్ధితో ఆ ప్రాంతానికి అమాంతమైన విలువ పెరిగింది. తిరుపతి నగర ప్రజల 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో వుంచుకుని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి నడుం బిగించారు. దీంతో సుమారు 2,500 ఎకరాల విస్తీర్ణం అమాంతంగా అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. వందలాది నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. నగరానికి వచ్చే వాహనాలు కొత్త రోడ్ల మీదుగా రాకపోకలు సాగిస్తుండడంతో కొంతమేర ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరికింది. ఈరోడ్లన్నీ అందుబాటులోకి వస్తే నగరంపై ఒత్తిడి తగ్గడంతో పాటు తిరుపతి తూర్పు ప్రాంతం అనతి కాలంలోనే అభివృద్ధి చెందేందుకు దోహదపడనుంది. చింతలచేను మాస్టర్ ప్లాన్ రోడ్డును ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ మద్దిల గురుమూర్తి, మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్‌రెడ్డి బుధవారం ఉదయం 6.45 గంటలకు ప్రారంభించనున్నారు.



ఏడాది క్రితం చింతలచేను రోడ్డులో ట్రాఫిక్

ఆకట్టుకుంటున్న రహదారి

చింతలచేను మాస్టర్ ప్లాన్ రోడ్డు ప్రారంభానికి సిద్ధమైంది. ఈ సందర్భంగా 80 అడుగుల రోడ్డును బీటీ (తారు) రోడ్డుగా నిర్మించారు. నల్లగా దగ దగ లాడుతూ ఈ రోడ్డు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఆకట్టుకునే విద్యుత్ వెలుగులు, డివైడర్ల మధ్యలో పరవశింప చేసే పచ్చదనం, జీబ్రాలైన్స్ స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ సునిత

తిరుపతి తుడా : చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఈఎస్‌ఐ ఆస్పత్రి ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సునిత తెలిపారు. ఈఎస్‌ఐ ఆస్పత్రిలో మంగళవారం చిరు ధాన్యాల ఉపయోగాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రాగులు, సజ్జలు, సామలు, కొర్రలు తదితర చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక, బీపీ, షుగర్ వంటి వ్యాధులను దరిచేరకుండా చేయవచ్చునని వివరించారు. శరీరంలో కొవ్వు శాతం తగ్గించి శ్వాసకోశ సంబంధిత వ్యాధులు తగ్గుతాయని పేర్కొన్నారు. శరీరానికి అవసరమైన శక్తిని తక్కువ మోతాదులోనే పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంవో డాక్టర్ ప్రసాద్, డాక్టర్ రమేష్ కుమార్, ఆయుష్ డాక్టర్స్ శ్రీలత, స్వప్నమంజరి, గాయత్రి, నర్సింగ్ సూపరింటెండెంట్ అములు పాల్గొన్నారు.

ఎస్వీ మెడికల్ కళాశాలకు విరాళం



నగదు అందజేస్తున్న డాక్టర్ మారుతి

తిరుపతి తుడా : ఎస్వీ మెడికల్ కళాశాలకు 2004 సంవత్సర వైద్య విద్యార్థులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్‌కు దాత డాక్టర్ మారుతి నగదు అందజేశారు. ఈ మొత్తాన్ని విద్యార్థుల వసతి గృహాల్లో వంట సామగ్రి, ఇతర వసతులకు వినియోగించాలని డాక్టర్ మారుతి కోరారు. ఇటీవల ఎల్‌సీడీ ప్రొజెక్టర్‌ను ఆయన బహూకరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ వసుంధరాదేవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని మంగళవారం తెలంగాణ ఎమ్మెల్సీ టి.రవీంద్రరావు, ఎంపీ మాలోత్ కవిత, బిలాస్పూర్ మఠం పీఠాధిపతి సచ్చిదానంద తీర్థ స్వామీజీ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

అదానీని కాపాడేందుకే రాహుల్‌పై అనర్హత వేటు

తిరుపతి కల్చరల్: అదానీ వ్యవహారాలపై లోకసభలో మాట్లాడినందుకే ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు. ఆయన మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రాహుల్ గాంధీపై బీజేపీ చేసిన కుట్రలకు వ్యతిరేకంగా ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా జై భారత్ సత్యాగ్రహం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ నిరంకుశ ధోరణికి వ్యతిరేకంగా చేపట్టే జై భారత్ సత్యాగ్రహాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నేతలు నారాయణ, సిద్దయ్య, రామచంద్రయ్య పాల్గొన్నారు.

గొల్లగంగమ్మకు ప్రత్యేక పూజలు

పాలసముద్రం: మండలంలోని ఆముదాల పంచాయతీ గొల్లకండ్రిగ గ్రామంలో వెలసిన మూర్తెమ్మ (గొల్లగంగమ్మ)కు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షిక కొలుపు మహోత్సవంలో భాగంగా గెరిగ ఊరేగింపు చేశారు. అంతకు ముందు ఉదయం ఆ లయ అర్చకులు అమ్మవారికి పాలు, తేనె, నెయ్యి, పెరుగు, చందనంతో అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి సమర్పించారు. గెరిగ ఊరేగింపు సందర్భంగా ప్రతి ఇంటి వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. గెరిగను అమ్మవారి గుడి వద్ద ఉంచి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త నాగేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మానవీయ బంధాలే రాజకీయాలు



మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ ప్రారంభోత్సవంలో మంత్రి రోజా

- మంత్రి రోజా

నగరి : రాజకీయాలు అంటే మానవీయ బంధాలే అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటే తనకు ప్రేరణని మంత్రి రోజా తెలిపారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయం వద్ద ఉచిత కంటి వైద్యశిబిరం, మొబైల్ ఐ సర్జికల్ యూనిట్‌ను ఆమె ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ సర్వేంద్రియానాం.. నయనం ప్రధానమన్నారు. కళ్లు కనపడని వారికి చూపునిస్తే, ప్రపంచాన్నే ముంగిట నిలిపినట్లని చెప్పారు. కంటి సమస్యలకు చికిత్స చేయించుకునేందుకు దూరాభారం వెళ్లలేని, ఖర్చు భరించలేని వారి కోసం స్థానికంగానే అత్యున్నత వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు. శిబిరంలో రోజూ 300 మందికి కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇలా 8 రోజుల పాటు శిబిరం కొనసాగుతుందని చెప్పారు. అవసరమైన వారికి మొబైల్ సర్జికల్ యూనిట్‌లో ఆపరేషన్ చేస్తారని వివరించారు. శంకరనేత్రాలయ ప్రతినిధి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మంత్రి రోజా చొరవతోనే వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.8.5 కోట్లతో సిద్ధం చేసిన మొబైల్ సర్జికల్ యూనిట్ ద్వారా దేశవ్యాప్తంగా క్యాంపులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఇప్పటి వరకు 11,447 మందికి ఆపరేషన్ చేశామని చెప్పారు. కార్యక్రమంలో నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు పీజీ నీలమేఘం, హరి, ఎంపీపీలు భార్గవి, దీప పాల్గొన్నారు.



మంత్రి రోజా సమక్షంలో పార్టీలో చేరుతున్న టీడీపీ నేతలు

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నాయకులు

నగరి :మండలంలోని ముడిపల్లి రామాపురంలో పలువురు టీడీపీ నేతలు, వారి అనుచరులు వైఎస్సార్ సీపీలోకి మంగళవారం చేరారు. వీరికి మంత్రి రోజా కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి, ఎంపీపీ భార్గవి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, నాయకులు సుదర్శనం నాయుడు, సర్పంచ్ ప్రకాష్, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణన్ పాల్గొన్నారు.

నేడు ఏ.రంగంపేటలో స్వచ్ఛభారత్

చంద్రగిరి: బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా బుధవారం మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ) ఆధ్వర్యంలో మండలంలోని ఏ.రంగంపేట నుంచి మోహన్‌బాబు డైరీ వరకు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ సారథి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రో చాన్స్‌లర్ మంచు విష్ణు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీసీ నాగరాజ రామారావు, అనుబంధ కళాశాల ప్రిన్సిపాళ్లు, డీన్లు, డిప్యూటీ రిజిస్ట్రార్లు, అధ్యాపకులు పాల్గొంటారు.

ఎమ్మెల్యే భూమనపై టీడీపీ నేతల విమర్శలు సిగ్గుచేటు



మాట్లాడుతున్న తిరుత్తణి వేణుగోపాల్

తిరుపతి కల్చరల్: ప్రజల సంక్షేమంతోపాటు తిరుపతి నగర అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిపై టీడీపీ నేతలు విమర్శించడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుత్తణి వేణుగోపాల్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. వారు మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో దోచుకుతిన్న చరిత్ర టీడీపీ నేతలదేనన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు దోపిడీ చేస్తే తిరుపతి నగరంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అల్లుడు రియల్ ఎస్టేట్, భూ కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. అధికారంలో ఉన్న సమయంలో సుగుణమ్మ తిరుపతి నగరంలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. భూకబ్జాలకు కేరాఫ్‌గా నలిచిని టీడీపీ నేతలు సంక్షేమ సారథులైన ఎమ్మెల్యే భూమన కుటుంబాన్ని విమర్శించడాన్ని చూస్తే దొంగే దొంగ అన్నట్టు ఉందన్నారు. తన బంధువు చేసిన హత్యను కప్పిపుచ్చుకోవడానికి పసలేని ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ఆరోపణలు మానుకోవాలని, లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ వాసు యాదవ్, నేతలు ఉదయ్ వంశీ, పసుపులేటి సురేష్, వినయ్ రాయల్, అరుణ్ యాదవ్ పాల్గొన్నారు.

వేగంగా స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు



మాట్లాడుతున్న స్మార్ట్ సిటీ బోర్డు ఎండీ అనుపమ అంజలి

తిరుపతి తుడా : తిరుపతి స్మార్ట్‌సిటీలో భాగంగా చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్మార్ట్ సిటీ ఎండీ, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. ఆమె మంగళవారం తిరుపతి స్మార్ట్ సిటీ డైరెక్టర్లతో ప్రత్యక్షంగా, జూమ్ ద్వారా స్మార్ట్‌సిటీ బోర్డు మీటింగ్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శ్రీనివాస సేతు ఫ్లై ఓవర్‌ను జూన్‌కల్లా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. అలానే ఆర్ట్ స్టూడియో, ఇండోర్, క్రికెట్ స్టేడియాల పనులు దాదాపు పూర్తయ్యాయని పేర్కొన్నారు. త్వరలో వాటిని ప్రారంభించేందుకు చర్యలు చేపడుతామన్నారు. ట్రాఫిక్‌ను దృష్టి లో వుంచుకుని మరిన్ని ఫ్రీ లెఫ్ట్‌లు అవసరమని తిరు పతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి వెల్లడించారు. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కాలపరిమితి పూర్తి అవుతున్నందున నిర్వహణ బాధ్యతల్ని పూర్తిగా మున్సిపల్ కార్పొరేషన్‌కు అప్పగిస్తూ బోర్డు తీర్మానం చేసింది. జూమ్ ద్వారా టీటీడీ జేఈవో సదాభార్గవి, న్యూఢిల్లీ నుంచి స్మార్ట్ సెక్రటరీ విజయకుమార్, తుడా వీసీ హరికృష్ణ, ఇండిపెండెంట్ డైరెక్టర్స్ రామచంద్రారెడ్డి, డాక్టర్ రమాశ్రీ, జీఎం చంద్రమౌళి, ఎస్ఈ తిరుమాలిక మోహన్, ఎంఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అనుమతి లేని వస్తువులను తీసుకోవద్దు

- కార్గోను పరిశీలించిన డీపీటీవో చెంగల్‌రెడ్డి



తిరుపతి బస్టాండ్‌లో తాగునీటి కొళాయిలను తనిఖీ చేస్తున్న డీపీటీవీ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: అనుమతి లేని వస్తువులను ఆర్టీసీ కార్గో ద్వారా రవాణా చేయవద్దని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం ఆయన తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని కార్గో సెంటర్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్ణయించిన ధరలు మాత్రమే వసూలు చేయాలని చెప్పారు. ప్రతి వస్తువుకూ సరైన భద్రత కల్పించాలన్నారు. సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని చెప్పారు. అనంతరం ఆయన బస్టాండ్‌ను పరిశీలించారు. ప్రయాణికుల తాకిడికి తగ్గట్టు సౌకర్యాలు కల్పించాలని డిపో అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే వస్తువులను విక్రయించాలని సూచించారు. పౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలైకి జిల్లా నుంచి బుధవారం 25 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. తిరుపతి అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు పాల్గొన్నారు.

ప్రారంభ దశలోనే గుర్తిస్తే క్యాన్సర్‌కు చెక్



క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ప్రారంభిస్తున్న ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

- మహిళల ఆరోగ్యం కుటుంబానికి అవసరం
- వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్: ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే నివారించేందుకు సాధ్యమవుతుందని, ఎంతో ఖరీదైన క్యాన్సర్ పరీక్షలు స్విమ్స్ ఆసుపత్రి తరపున గ్రామాల్లో ఉచితంగా చేపట్టడం శుభపరిణామమని వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. ముండ్లపూడిలో మంగళవారం పింక్ బస్ ద్వారా మహిళలకు క్యాన్సర్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమాన్ని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలంటే రూ.వేలు ఖర్చు అవుతుందని, పింక్ బస్‌లో ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా మొబైల్ మామోగ్రఫీ, గర్భాశయ ముఖద్వార, నోటి, బ్రెస్ట్ అల్ట్రాసౌండ్ పరీక్షలను నిర్వహిస్తున్నందున మహిళలు తప్పక చేయించుకుని సూచించారు. క్యాన్సర్ రహిత సమాజ స్థాపనకు టీటీడీ ఆధ్వర్యంలో నడిచే పింక్ బస్‌ను ఇకపై అన్ని గ్రామ పంచాయతీల్లోకి వచ్చి వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రామచంద్రారెడ్డి, సురేష్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ తిరుమలయ్య, ఎంపీటీసీ వాసురెడ్డి, ఉపసర్పంచ్ కుప్పిరెడ్డి, స్విమ్స్ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

శ్మశానాన్ని ఆక్రమించుకున్నప్పుడు తెలియదా..?

- ఫారెస్ట్‌లో అంత్యక్రియలకు ఒప్పుకోమన్న అటవీ అధికారులు
- రోడ్డుపై శవాన్ని పెట్టుకుని టీడీపీ నాయకుల ధర్నా డ్రామా
- శ్మశాన స్థలంలో ఆక్రమణలు తొలగించాలని కార్పొరేటర్ అనిల్ నిరసన



మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి శ్మశానానికి స్థలం ఇవ్వాలని ధర్నా డ్రామా చేస్తున్న టీడీపీ వర్గీయులు

తిరుపతి మంగళం : వందేళ్ల నుంచి శ్మశానంగా వినియోగించుకుంటున్న స్థలాన్ని ఆక్రమించుకుని, అక్కడ ఇళ్లు కట్టుకున్నప్పుడు శ్మశానం కావాలన్న విషయం తెలియదా..? అని తిరుపతి 50వ డివిజన్ కార్పొరేటర్ బోకం అనిల్‌తో పాటు తిమ్మినాయుడు పాలెం గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. తిరుపతి అర్బన్ మండలం తిమ్మినాయుడుపాలెం హరిజనవాడలో మంగళవారం లీలమ్మ అనే మహిళ మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని హరిజనవాడ వెనుక వైపు ఉన్న రిజర్వు ఫారెస్ట్ స్థలంలో పూడ్చేందుకు ప్రయత్నించారు. అందుకు అటవీశాఖ అధికారులు అంగీకరించలేదు. ఉన్న శ్మశాన స్థలంలో మీరు ఇల్లు కట్టుకుని ఫారెస్ట్ స్థలాన్ని శ్మశానంగా వాడుకుంటామంటే ఎలా ఒప్పుకుంటామని హెచ్చరించారు. దాంతో స్థానిక టీడీపీ నాయకుడు వెంకటరత్నం వర్గీయులు కొందరు శవంతో రోడ్డుపై బైఠాయించి ధర్నా డ్రామా చేశారు. అంబులెన్స్‌కు కూడా దారి వదలలేదు. అందులో ఉన్న రోగులు దారి ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదు. శ్మశాన స్థలాన్ని ఆక్రమించేది వీళ్లే, శ్మశానం కావాలని ధర్నాల పేరుతో డ్రామాలు చేసేది వీళ్లే అంటూ స్థానికులు మండిపడ్డారు. కార్పొరేటర్ బోకం అనిల్‌తో పాటు గ్రామస్తులు వారికి వ్యతిరేకంగా రోడ్డుపై బైఠాయించి ఆక్రమణలు తొలగించి శ్మశాన స్థలాన్ని పరిరక్షించాలని ధర్నా చేశారు. ఉన్న శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకోకుంటే ఈ రోజు ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదు కదా అని మండిపడ్డారు. 1.45 ఎకరాల భూమి తమ గ్రామానికి శ్మశానంగా ఉండేదని, అందులో కొందరు టీడీపీ నాయకులు అక్రమంగా ఇళ్లు నిర్మించుకోవడంతో శ్మశానం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. గతంలో కూడా రిజర్వు ఫారెస్ట్‌లోమృతదేహాలను పూడ్చేందుకు వెళ్లినప్పుడు అటవీ అధికారులు అడ్డుకున్నారని తెలిపారు. హరిజనవాడ ఎదురుగా ఉన్న శ్మశాన స్థలంలోని ఆక్రమణలను తొలగించి శ్మశానానికి వినియోగించుకునేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ అనిల్, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు కుప్పయ్య, స్థానికులు కోరుతున్నారు.



నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ బోకం అనిల్, గ్రామస్తులు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సంబరాలు


కేక్‌కట్‌ చేస్తున్న ఎస్వీయూ వీసీ రాజారెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్‌ శ్రీహరి

తిరుపతి తుడా : తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం ఘనంగా సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తొలి అధికారి డాక్టర్‌ శ్రీహరికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో ఎస్వీయూనివర్సిటీ వీసీ రాజారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి కేక్‌ కట్‌ చేసి అందరికీ పంచి పెట్టారు. తిరుపతి మున్సిపల్‌ కార్పొరేషన్‌ హెల్త్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ హరికృష్ణ, ఇతర వైద్యాధికారులు అరుణ సులోచన, సుధారాణి, శ్రీనివాసులు, రుయా అభివృద్ధి కమిటీ వర్కింగ్‌ చైర్మన్‌ బండ్ల చంద్రశేఖర్‌ రాయల్‌ తదితరులు పాల్గొన్నారు.

శుకబ్రహ్మాశ్రమంలో ఘనంగా ఆరాధనోత్సవాలు


పురవీధుల్లో విద్యాప్రకాశనందగిరిస్వామి చిత్రపటం ఊరేగింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో మంగళవారం ఘనంగా 25వ ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. అందులోభాగంగా ఆశ్రమ వ్యవస్థాపకులు విద్యాప్రకాశనందగిరి స్వామి చిత్రపటానికి పూజలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. అనంతరం వాహనంపై అధిష్టింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్‌ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో కళాశాలను స్థాపించి ఎంతోమందికి విద్యాప్రకాశనందగిరిస్వామి ఎంతోమందికి విద్యాదాత అయ్యారన్నారు. ఆయనను ఎప్పటికీ మరువలేమన్నారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపనందగిరిస్వామి మాట్లాడుతూ సకల లోకానికి గీత మకరందాన్ని అందించి జీవుడికి భగవంతుని చేరుకునే మార్గాన్ని ఉపదేశించి మహనీయుడు విద్యాప్రకాశనందగిరి స్వామి అని అన్నారు. ఆశ్రమ ఉత్తరాధికారి సంపూర్ణనంద గిరిస్వామి, ఆర్డీఓ రామారావు, పాలకమండలి సభ్యులు సునీత, రమాప్రభ, సుమతి, ప్రత్యేక ఆహ్వానితులు శ్రీదేవి, చింతామణి పాండు, ప్రముఖులు అజయ్‌ కుమార్‌, రత్నంరెడ్డి, రాజేశ్వరరావు, గరికపాటి రమేష్‌బాబు, డిల్లీబాబు, భాస్కర్‌ ముదిరాజ్‌, కొల్లూరు హరినాయుడు, పసల కుమారస్వామి, ఉదయ్‌కుమార్‌, నరసింహులు, కల్యాణ్‌, సూరి, ప్రసాద్‌, తేజ పాల్గొన్నారు.

చండీహోమం మండపం పనుల పరిశీలన

శ్రీకాళహస్తీశ్వరాలయంలో చండీహోమం, రుద్రహోమం మండప ఆధునికీకరణ పనులను మంగళవారం పాలకమండలి చైర్మన్‌ అంజూరు శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆలయంలోని కాళికాదేవి వద్ద ఉన్న చండీహోమం , రుద్రహోమం మండపాలను పూర్తిగా తొలగించి వాటి స్థానంలో రూ.16లక్షలతో 50మంది కూర్చునే విధంగా సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం చండీహోమం, రుద్రహోమం మణికంఠేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్‌, ఇంజినీరింగ్‌శాఖ అధికారులు ఏఈ కిషోర్‌కుమార్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రతాప్‌, సిబ్బంది సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

సత్యవేడు: శ్రీసిటీ పరిధిలోని ఆరూరు నర్సరీ వద్దనున్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం విష్ణు సహస్ర పారాయణం వైభవంగా నిర్వహించారు. ఈ ప్రాంత ప్రజలు, ఉద్యోగుల క్షేమంతో పాటు శ్రీసిటీ మరింత పురోగతి సాధించాలనే ఆకాంక్షతో తలపెట్టిన పూజలు నాలుగు రోజుల పాటు జరుగనున్నాయి. మొదటి రోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్‌వరణం, ప్రధాన కలశ స్థాపన, అష్టోత్తరం, విష్ణు సహస్ర పారాయణ పూజలు జరిగాయి. శ్రీసిటీ మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ ఉద్యోగులు, పరిసర ప్రాంతాల ప్రజలు స్వామివారిని దర్శించుకున్నారు.


పూజలో పాల్గొన్న రవీంద్ర సన్నారెడ్డి

కోదండరామునికి విశేష పూజలు


హరికథా గానం

వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్లపల్లె, గుండుపల్లె, పచ్చికాపల్లం గ్రామాల్లోని కోదండరామస్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. నవమి ఉత్సవాల్లో భాగంగా పెరుమాళ్లపల్లెలో సోమవారం రాత్రి చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బొమ్మన్‌దొడ్ల గ్రామంలో శ్రీకృష్ణ ఆలయంలో భక్తి ప్రపత్తులతో పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. భజనలు ఆకట్టుకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

పిచ్చాటూరు: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో వృద్ధుడు గాయపడ్డాడు. నాగలాపురం మండలం బైటకొడియంబేడుకు చెందిన సుబ్రమణ్యం (62) సొంత పని నిమిత్తం మంగళవారం నాగలాపురం వచ్చాడు. సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యాడు. భారత్‌ గ్యాస్‌ ఏజెన్సీ వద్ద ఎదురుగా పుత్తూరు వైపు వెళ్తున్న ఇన్నోవా కారు ఢీకొంది. సుబ్రమణ్యంకు గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో నాగలాపురం పీహెచ్‌సీలో ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

కిటకిటలాడిన రైల్వే స్టేషన్



తిరుపతి నుంచి బయలుదేరుతున్న రైలు



తిరువణ్ణామలై నుంచి తిరుపతికి రావడానికి విల్లుపురం ట్రైన్ కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

- తిరువణ్ణామలైకి క్యూకట్టిన భక్తులు
- తిరుపతి జిల్లా నుంచే పదివేల మందికి పైగా పయనం
- విల్లుపురం రైలు భలే రద్దీ

తిరుపతి అర్బన్ : తిరువణ్ణామలైలో అగ్ని లింగాన్ని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని, గిరి ప్రదర్శన చేయడం ద్వారా ముక్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో ప్రతి పౌర్ణమికి భక్తులు పెద్ద సంఖ్యలో తిరువణ్ణామలై వెళ్లి స్వామిని దర్శించుకోవడంతోపాటు గిరి ప్రదక్షిణ చేసుకునేందుకు తరలివెళుతున్నారు. ఈ క్రమంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలై వెళ్లే భక్తులతో మంగళవారం తిరుపతి రైల్వే స్టేషన్ కిటకిటలాడింది. తిరుపతి నుంచి తిరువణ్ణామలై మీదుగా విల్లుపురం(మెమో) ప్యాసింజర్ రైలు ప్రతిరోజూ నడుస్తోంది. ఇది మధ్యాహ్నం 1.50 గంటలకు తిరుపతిలో బయలుదేరి చంద్రగిరి, పాకాల, చిత్తూరు, రామాపురం, కాట్పాడు, రాయవేలూరు, కాణామంగళం, అణ్ణోపురం, చదరామపట్టిడి మీదుగా తిరువణ్ణామలై, విల్లుపురానికి రాత్రి 7 గంటలకు చేరుకుంటుంది. తిరిగి తిరువణ్ణామలైలో ఉదయం 5.30 గంటలకు బయలుదేరి నుంచి 11.30 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. అనుకూలంగా ఉండడంతో ఈ రైలులో తిరువణ్ణామలై వెళ్లడానికి ఎక్కువ మంది ఇష్టపడతారు. ఈ రైలులో 8 బోగీలు ఉండగా రెండు వేలమంది ప్రయాణికులు ప్రయాణం చేయవచ్చు. పౌర్ణమి సందర్భంగా 5 వేల మందికి పైగా ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారు. దీంతో వృద్ధులు, మహిళలు, పిల్లలు తోపులాటలో నలిగిపోతున్నారు. అదనంగా మరో రైలు లేదా మరికొన్ని బోగీలను ఏర్పాటుచేయాలన్న డిమాండ్ ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

రద్దీ ఉన్నా ప్రతిపాదనలు లేవు



ప్రతి రోజూ మధ్యాహ్నం 1.50 గంటలకు తిరుపతి నుంచి వెళ్లే విల్లుపురం(మెమో) వెళ్లే రైలులో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు వెళుతున్నారు. ముఖ్యంగా పౌర్ణమి సందర్భంగా రద్దీ మరింత పెరుగుతున్న మాట వాస్తవం. సింగిల్ లైన్ కావడంతో మరో రైలు వేయడానికి ప్రతిపాదనలు లేవు. అయినప్పటికీ ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేస్తాం.

- కే.చిన్నపరెడ్డి, స్టేషన్ మేనేజర్, తిరుపతి రైల్వే స్టేషన్

నిస్సహాయులపై 'వాత్సల్యం'

అనాథ బిడ్డలను ఆదుకోవాలి.. నిస్సహాయులకు నీడగా నిలవాలి.. సంరక్షణ లేని పిల్లలకు భరోసా కల్పించాలి.. వీధి బాలలకు వెన్నుదన్నుగా ఉండాలి.. తల్లి దండ్రులను కోల్పోయిన వారి జీవనానికి సాయం చేయాలి. ఇదే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాయి. 2019 కోవిడ్ సమయంలో ఉన్నతమైన 'మిషన్ వాత్సల్య' పథకానికి రూపకల్పన చేశారు. సంయుక్త భాగస్వామ్యంతో ప్రతి నెలా రూ.4వేలు అందిస్తూ చేదోడుగా నిలుస్తున్నారు.

- పోషణ కరువైన పిల్లలకు ప్రభుత్వ సాయం
- కేంద్రం, రాష్ట్రం సంయుక్త భాగస్వామ్యంతో చేయూత
- మిషన్ వాత్సల్య కింద ప్రతి ఒక్కరికీ నెలకు రూ.4వేలు

పలమనేరు: నిస్సహాయస్థితిలో.. పూట గడవడం కష్టమైన 18 ఏళ్లలోపు పిల్లలను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ వాత్సల్య పథకం ప్రవేశపెట్టాయి. లబ్ధిదారులకు ప్రతి నెలా రూ.4వేల ఆర్థిక సాయం అందిస్తున్నాయి. మహిళాశిశుసంక్షేమశాఖ, బాలల సంక్షేమ రక్షణ విభాగం ద్వారా పకడ్బందీగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి.

సంయుక్త భాగస్వామ్యంతో....

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తితో మిషన్ వాత్సల్యకు నిధులు కేటాయిస్తున్నాయి. ఈ మేరకు కేంద్రం రూ.2,400 రాష్ట్రం రూ.1,600 లెక్కన సమష్టిగా పంపిణీ చేస్తున్నాయి.



పలమనేరు సీడీపీవో కార్యాలయంలో ధరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారిణులు

అర్హులు ఎవరంటే...

- వితంతువు, విడాకులు తీసుకున్న తల్లి, పిల్లలు
- భర్తను వదిలేసిన తల్లుల బిడ్డలు
- ప్రాణాంతన వ్యాధితో బాధపడుతున్న వారి పిల్లలు
- కోవిడ్ కారణంగా తల్లిదండ్రులు దూరమైన వారు
- పేదరికంతో అమ్మానాన్న పెంచలేని వారు
- బాల న్యాయచట్టం మేరకు ఆదరణ అవసమైన చిన్నారులు
- బాల కార్మికులు, బాల్య వివాహాలు చేసుకున్న బాధితులు
- అక్రమరవాణాకు గురైన పిల్లలు
- హెచ్ఐవీ బాధితులైన తల్లిడండ్రులు గలవారు



- పారిపోయి, తప్పిపోయి, యాచకులుగా మారిన చిన్నారులు
- హింస, దోపిడీకి అనాథలుగా మారి అనాథాశ్రయాల్లోని పిల్లలు
- పీఎం కేర్‌ఫర్ చిల్డ్రన్స్ తదితరులు
- కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72వేలు, పట్టణాల్లో రూ.96వేలు మించని వారు ఈ పథకం కింద లబ్ధిపొందేందుకు అర్హులు.

దరఖాస్తు ఇలా..

అర్హులైన వారు ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ వర్కర్ ద్వారా దరఖాస్తు పొందాల్సి ఉంటుంది. లేదా మీసేవా కేంద్రాలు, ఇంటర్‌నెట్‌లోనూ అప్లికేషన్ అందుబాటులో ఉంది. ఆ మేరకు అవసరమైన పత్రాలను జతపరిచి ఐసీడీఎస్ అధికారులకు దరఖాస్తు అందించాలి. ఈ మేరకు ఇప్పటికే ఆయా ప్రాజెక్టుల పరిధిలో సుమారు 200 వరకు దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం.

అర్హుల ఎంపిక ఇలా..

దరఖాస్తుదారుల్లో లబ్ధిదారులను జిల్లా కమిటీ ఎంపిక చేస్తుంది. ఈ కమిటీలో మిషన్ వాత్సల్య చైర్మన్‌గా కలెక్టర్, జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారి, సీడబ్ల్యూసీ, డీసీపీఓ, ఎస్ఐసీపీఓ, ఎన్జీఓ సంస్థ నిర్వాహకులు సభ్యులుగా ఉంటారు.

సద్వినియోగం చేసుకోవాలి



అర్హులందరూ మిషన్ వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. లబ్ధిదారుల ఎంపికలో భాగంగా బాధిత చిన్నారులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నాం. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పిల్లలను ఆదుకునే గొప్ప పథకం ఇది.

- ప్రతిమ, ఇన్‌స్టిట్యూషనల్ కేర్ ప్రొటెక్షన్ అధికారి, చిత్తూరు

అంగన్‌వాడీల ద్వారా దరఖాస్తులు



అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా మిషన్ వాత్సల్య పథకానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. సచివాలయ మహిళా పోలీసులు, వలంటీర్ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. అవరమైన పత్రాలతో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి.

- ఇందిరాప్రియదర్శిని, సీడీపీఓ, పలమనేరు

ఉద్యోగ మేళా రేపు

సత్యవేదు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉద్యోగమేళా జరుగుతుందని ఎంపీపీ వి.ప్రతిమ తెలిపారు. శ్రీసిటీలోని మొబైల్ కంపెనీలో పనిచేసేందుకు క్యూస్ సంస్థ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూ నిర్వహిస్తుందన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన 19 నుంచి 30 ఏళ్లలోపు మహిళలు అర్హులని హెచ్ఆర్ వినయ్‌కుమార్ తెలిపారు. నెలకు రూ. 13,286 వేతనం ఇస్తారని తెలిపారు.

తెప్పపై రామచంద్రమూర్తి అభయం



తెప్పపై విహరిస్తున్న సీతారామలక్ష్మణులు

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి తెప్పోత్సవాలు రెండో రోజైన మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్వామి వారు రామచంద్ర పుష్కరిణిలో తెప్పపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం ఆలయంలో స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమాల సేవ, సహస్ర నామార్చన చేపట్టారు. 8 నుంచి 9.30 గంటల వరకు సీతాలక్ష్మణ సమేత కోదండరాముడి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరి నీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు సీతారామలక్ష్మణులు ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి శ్రీరామచంద్ర పుష్కరిణికి చేరుకున్నారు. విద్యుద్దీపాలతో అందంగా అలంకరించిన తెప్పను సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి అధిరోహించి భక్తులు రామ నామస్మరణలు చేస్తుండగా పుష్కరిణిలో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. భక్తులు కర్పూర నీరాజనాలు అందించి సీతారామలక్ష్మణులను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు మారుతి ప్రసాద్, ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో మోహన్, సూపరింటెండెంట్ రమేష్‌కుమార్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పూజలందుకుంటున్న సీతారామలక్ష్మణులు

తుంబురుతీర్థ ముక్కోటిపై సమీక్ష

తిరుమల: తిరుమలలో బుధ, గురువారాల్లో తుంబురుతీర్థ ముక్కోటిని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఏర్పాట్లపై టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి ఆదేశాల మేరకు పీఏసీ 4లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మంగళవారం టీటీడీ విజిలెన్స్, తిరుమల పోలీసులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు.

- తుంబురుతీర్థానికి బుధవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, గురువారం ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు భక్తులను అనుమతిస్తారు.
- తీర్థానికి ఎక్కువ దూరం నడవాల్సి ఉన్న నేపథ్యంలో గుండె సమస్యలు, స్థూలకాయం ఉన్నవారిని అనుమతించరు.
- భక్తులు వంట సామగ్రి, కర్పూరం, అగ్గిపెట్టెలు తీసుకురాకూడదు.
- పాప వినాశనం వద్ద పార్కింగ్ సౌకర్యం లేదు. అందువల్ల ప్రైవేట్ ట్యాక్సీలు, వాహనాలను అనుమతించరు. ఆర్టీసీ బస్సుల్లో మాత్రమే భక్తులను అనుమతిస్తారు.
- పోలీసు, అటవీశాఖలు, టీటీడీ విజిలెన్స్ విభాగం అధికారులు సమన్వయంతో పాపవినాశనం నుంచి తుంబురు తీర్థం వరకు అక్కడక్కడా భద్రతా సిబ్బందిని నియమించి భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఈ సమావేశంలో ఏఎస్పీ మునిరామయ్య, వీజీవో బాలిరెడ్డి, ఇతర విజిలెన్స్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

తలకోన ఆలయ పాలకమండలికి దరఖాస్తులు

తిరుపతి రూరల్: తలకోన శ్రీసిద్ధేశ్వర స్వామి ఆలయ పాలక మండలిలో ఖాళీగా పోస్టును భర్తీ చేసేందుకు దేవదాయశాఖ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రస్తుత పాలక మండలి చైర్మన్‌గా ఉన్న కోడి ఉమామహేశ్వరరెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 12న మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆ పోస్టును భర్తీ చేసేందుకు అర్హులైన హిందూ మతానికి చెందిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ రణాప్రతాప్ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 20 రోజుల లోపు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.